మళ్లీ 'నామినేటెడ్' సందడి

- ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన
- నాలుగు ఏఎంసీలూ టీడీపీకి కేటాయింపు

కాకినాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరోసారి నామినేటెడ్ పదవుల సందడి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పలు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 30 ఏఎంసీ చైర్మన్ల జాబితాను బుధవారం విడుదల చేయగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నలుగురిని నియమించారు. నాలుగు మార్కెట్ కమిటీలను టీడీపీకి కేటాయించారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ అర్బన్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బచ్చు శేఖర్, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మార్ని వాసుదేవ్, కొవ్వూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అయినవిల్లి టీడీపీమండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్‌ను నియమించారు.

22నుంచి డెల్టా కాలువలు మూసివేత

- ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో కాలువల మూసివేత గడువు పెంపు

ధవళేశ్వరం,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 22నుంచి డెల్టా కాలువలు మూసివేయనున్నారు. రబీ అనంతరం ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా పారేందుకు డెల్టా కాలవల షెట్టర్ లు, లాకులు వంటి మరమ్మతులు(క్లోజర్ పనులు) చేపట్టడానికి కాల్వలకు నీటి విడుదల నిలిపివేస్తారు. డెల్టా కాలువలు ఈనెల 16నే మూసివేసేందుకు సిద్ధంకాగా గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడానికి ఇతరత్ర అవసరాలకోసం ఈ నెల 22 వరకు నీటిని విడుదలకు గడువు పెంచారు. ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో కాల్వల మూసివేతను 22వరకు వాయిదా వేశారు. కాగా బుధవారం కాటన్‌బ్యారేజ్‌నుంచి తూర్పుడెల్టాకు 1200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3వేలక్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంవద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది.

● రబీని గట్టెక్కించిన సీలేరు జలాలు

తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలోని 8.96లక్షల ఎకరాలకు రబీలో సాగునీటిని సమృద్ధిగా అందించారు. డిసెంబర్‌నుంచి నేటివరకు మూడు డెల్టా కాలువలకు 114.644 టీఎంసీల నీటిని కాటన్ బ్యారేజ్ నుంచి విడుదల చేశారు. సీలేరు నుంచి పవర్ జనరేషన్‌ద్వారా 44.084 టీఎంసీలు గోదావరికి విడుదల కాగా, బైపాస్ మార్గం ద్వారా నేరుగా 17.781టీఎంసీలు విడుదల చేశారు. సీలేరునుంచి మొత్తం 61.865 టీఎంసీలు గోదావరికి విడుదలయ్యాయి. పోలవరంవద్ద 16 టీఎంసీల నీటి నిల్వలు ఉంటాయని అధికారులు లెక్కకట్టగా రబీ సీజన్‌లో గోదావరిలో సహజ జలాల లభ్యత 36 టీఎంసీలకు పైగా ఉంది. గత రబీసీజన్‌లో అప్పటి వైసీపీ ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్ర సాగునీటి ఎద్దడి నెలకొన్నారు. అప్పట్లో మార్చి నెలాఖరు నాటికి ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం 5.50అడుగులకు పడిపోయింది. పాండ్‌లో నీరు డెల్టా కాలువలకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సాగునీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీ సభ్యులు, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారుల సమన్వయంతో రబీకి సమృద్ధిగా సాగునీరందించారు.



ప్లస్ కాదు.. మైనస్!

- ప్లస్ 2 ఇంటర్‌తో అవస్థ
- హైస్కూళ్లలో సౌకర్యాలు కరువు
- సున్నా ఫలితాలు..దిగజారిన ఉత్తీర్ణత
- విద్యార్థుల భవితతో చెలగాటం
- జగన్ అనాలోచిత నిర్ణయం ఫలితం
- గతేడాది పాస్ శాతం అంతంతే
- ఏడాదైనా మారని తీరు..
- సర్కారు దృష్టి పెట్టాల్సిందే..

ఇంటర్ అంటే విద్యార్థి భవిష్యత్.. అక్కడ వేసిన అడుగే ముందుకు నడిపిస్తుంది.. ఇంజనీరింగ్.. మెడిసిన్.. ఐఐటీ..జేఈఈ వంటి ఉన్నత చదువులకు పునాది ఇక్కడే.. అటువంటి పునాదికి జగన్ మంగళం పాడేశారు. రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వ హయాంలో హైస్కూల్స్‌లో 'ప్లస్' అంటూ ఉన్నత పాఠశాలల్లో ఆర్భాటంగా ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించారు.విద్యార్థుల బోధన అంశాన్ని గాలికొదిలేశారు. దీంతో హైస్కూల్ ప్లస్‌లు విద్యార్థుల జీవితాలను మైనస్‌లో పడేస్తున్నాయి. ఈ ఏడాది కొన్ని పాఠశాలల్లో ఒక్కరూ పాస్ కాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి.

(రాజమహేంద్రవరం/కాకినాడ/అమలాపురం -ఆంధ్రజ్యోతి)

హైస్కూల్ ప్లస్ అనేది రెంటికీ చెడ్డ రేవడిగా తయారైంది.పాఠశాల విద్యాశాఖ పదో తరగతి వరకూ దృష్టి సారిస్తోంది. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. కానీ హైస్కూల్ ప్లస్ మాత్రం ఎటు కాకుండా పోతోంది. దీంతో విద్యార్థుల చదువు చతికిలబడుతోంది.గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 'హైస్కూలు ప్లస్' పేరుతో ఏర్పాటు చేసిన ఇంటర్‌కు రెండేళ్లలో పరీక్షలకు హాజరైన విద్యార్థుల ఉత్తీర్ణత గణనీయంగా పడిపోయింది.కొన్ని స్కూళ్లలో అయితే సున్నా ఫలితాలు వచ్చాయి.హైస్కూలు ప్లస్‌లో సరైన మౌళిక సదుపాయాలు, నిపుణులైన అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థుల భవిత పూర్తిగా అంధకారమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు హైస్కూలు ఉపాధ్యాయులతోనే విద్యాబోధనను మమ అనిపించారు.దాంతో ఆ హైస్కూలు ప్లస్‌లో చదివిన విద్యార్థులు ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోయింది.

ఇంటర్ ఫలితాల్లో వెనుకబడింది!



8 పాఠశాలల్లో పాస్ జీరో

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ప్రథమ సంవత్సరానికి చెందిన హైస్కూలు ప్లస్ విద్యార్థులు 300 మంది పరీక్షలకు హాజరైతే వారిలో 81 మంది అంటే 27.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 219 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో ఫెయిలయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 224 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 112 మంది అంటే 50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సబ్జెక్టుల వారీగా విద్యాబోధన చేసే అధ్యాపకులు లేకపోవడం, మొక్కుబడిగా పాఠశాల ఉపాధ్యాయులతోనే క్లాస్‌లు నడిపించడం అధ్వాన ఫలితాలకు కారణంగా భావిస్తున్నారు.అంతర్వేదిపాలెం, కందికుప్ప, ర్యాలి, పి.గన్నవరం, ఐ.పోలవరం, గొల్లవిల్లి, ముంగండ, జి.వేమవరం పాఠశాలల్లో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో సున్నా ఫలితాలు నమోదయ్యాయి. ద్వితీయ సంవత్సరం అంతర్వేదిపాలెంలో సున్నా ఫలితాలు వెలువడ్డాయి.

ఈ ఏడాది ఫలితాలివీ

తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఈ ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో హైస్కూల్ ప్లస్ పాఠశాలలు కొన్ని చాలా దారుణమైన ఫలితాలను నమోదు చేశాయి. ఐదు పాఠశాలల్లో మొదటి ఏడాది, ఒక పాఠశాలలో రెండో ఏడాది ఒక్కరూ పాస్ కాలేదు. మొదటి ఏడాది రోల్ 483 ఉంటే 454 మంది పరీక్షలకు హాజరయ్యారు. దీంట్లో కేవలం 182 మంది మాత్రమే గట్టెక్కారు. రెండో ఏడాది 283కి 269 మంది పరీక్షలు రాయగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు. అయితే గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఉత్తీర్ణత కాస్త మెరుగుపడడం గమనార్హం.

ఏ జిల్లా చూసినా ఇదే తీరు..

తూర్పుగోదావరి జిల్లాలో 22 ఉన్నత పాఠశాలల్లో 'హైస్కూల్ ప్లస్' అనే పేరుతో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది కోర్సులను ప్రారంభించారు. తర్వాత రెండో ఏడాది 14 స్కూళ్లలో అందుబాటులోకి తెచ్చారు. అయితే లెక్చరర్ల నియామకం, ప్రయోగశాలలు, మౌళిక సదుపాయాల ఏర్పాటును పట్టించుకోలేదు. సరైన తరగతి గదులు లేవు. హైస్కూల్ ఉపాధ్యాయులతోనే ఆయా సబ్జెక్టుల్లో పీజీ చేసిన వారితో ఈ విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారు. ఆ ఉపాధ్యాయులు వారి రెగ్యులర్ తరగతులు చూసుకొని ఇంటర్ విద్యార్థులకు చెప్పాల్సి వస్తోంది. కొన్ని స్కూల్స్‌లో పరీక్షలు దగ్గరకు వచ్చినా కోర్సులో ఏ పుస్తకాలు ఉంటాయి, వాటిలో ఏమి పాఠాలు ఉంటాయనేవి కూడా చాలా మంది విద్యార్థులకు అవగాహన లేకుండా ఉంటుందంటే హైస్కూల్ ప్లస్ విద్యార్థుల దుస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

స్కూలా.. కాలేజీనా?

ఒకటి నుంచి ఐదు వరకూ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం జరుగుతుంది. వాళ్లు ఆరు నుంచి ఉన్నత పాఠశాల (హైస్కూల్)కి వెళతారు. దీంతో హైస్కూల్ విద్యార్థులమనే ఒక రకమైన ఆనంద భావనతో పిల్లలుంటారు. తర్వాత ఇంటర్మీడియట్ కోసం కళాశాల(జూనియర్ కాలేజీ)లో చేరతారు. అప్పటి వరకూ స్కూల్ పిల్లలమనే భావన నుంచి కాలేజీకొచ్చామంటూ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్టు ఫీలవుతారు. అక్కడ మాస్టారు.. ఇక్కడ లెక్చరర్‌గా విద్యను బోధిస్తారు. ఇదంతా పిల్లల మానసిక పరిపక్వత, ఆలోచన సామర్థ్యం, సృజనాత్మకత పెంపుదలకు దోహదపడుతుందని విద్యానిపుణులు చెబుతున్నారు. కానీ హైస్కూల్ ప్లస్ పేరుతో పిల్లలను అక్కడే ఉంచేసి వాళ్లలో గందగోళాన్ని నింపారు.ఆ ప్రభావం చదువుపై పడే అవకాశం లేకపోలేదని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కార్తీక్ విశ్లేషించారు.జూనియర్ కళాశాలల మాదిరిగా లెక్చరర్లు,మౌలిక సదుపాయాలు, ప్రయోగ శాలలను అందుబాటులోకి తెస్తే పరిస్థితి మారవచ్చు.

కాకినాడ / ఏఎస్ఆర్ జిల్లాల్లో ఫలితాలు

హైస్కూల్ ప్లస్ కేంద్రం	ప్రథమ హాజరు	ఉత్తీర్ణత	ద్వితీయ హాజరు	ఉత్తీర్ణత
1.లంపకలోవ	7	1	13	4
2.ములగపూడి	19	2	13	1
3.రౌతులపూడి	57	1	0	0
4.సామర్లకోట	20	9	21	14
5.మూలపేట	50	30	46	33
6.లింగంపర్తి	16	8	6	6
7.మల్లేపల్లి	22	12	0	0
8.చేబ్రోలు	28	11	18	13
9.రాజపూడి	13	9	12	5
10.రమణయ్యపేట	37	13	42	17
11.కరప	23	9	34	8
12.తామరాడ	20	8	17	6
13.పిఠాపురం	51	8	18	13
14.చంద్రమాంపల్లి	20	10	7	7
15.కోటనందూరు	21	1	0	0
	404	132	247	127

హైస్కూల్ ప్లస్ కేంద్రం	ప్రథమ హాజరు	ఉత్తీర్ణత	ద్వితీయ హాజరు	ఉత్తీర్ణత
1.రాజవొమ్మంగి	12	6	3	3
2.అడ్డతీగల	14	0	4	4
3.దేవీపట్నం	41	0	13	2
	67	6	20	9

దేవీపట్నంలో హాజరు 41.. పాస్ జీరో!

(రంపచోడవరం/రాజవొమ్మంగి-ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా రంపచోడవరం మన్యంలో మూడు చోట్ల ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టు జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల, అడ్డతీగల జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల, దామనపల్లి గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్లస్ టు కళాశాలలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో అడ్డతీగల, దేవీపట్నంలో జీరో ఫలితాలు వచ్చాయి. దేవీపట్నంలో మొదటి ఏడాదిలో 41 మంది పరీక్షలు రాయగా ఒక్కరూ పాస్ కాలేదు. రాజవొమ్మంగిలో గత రెండేళ్ల నుంచి మొదటి సంవత్సరంలో ఏ ఒక్కరూ పాస్ కాకపోగా, ఈ ఏడాది ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాసయ్యారు.



ప్రజల సొమ్ము.. పరుల పాలు!

- ప్రైవేట్ స్థలం అభివృద్ధికి రూ.2.72కోట్లు కేటాయింపు
- ఇప్పటికే ఆ స్థల వివాదంపై కోర్టులో కేసు
- కౌడా తీరుపై విమర్శలు.. అనుమానాలు..
- పంపకాలకు ప్రభుత్వ నిధులు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్త చేసిన వైనమిది.. వివాదంలో ఉన్నస్థలానికి ఉన్నతాధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి నిధులు కేటాయింపు చేయడం వివాదాస్పదం అవుతోంది. వివాదంలో ఉన్న ఒక స్థలాన్ని అభివృద్ధి చేయడానికి కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) నుంచి రూ.2.72కోట్ల నిధులను కేటాయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రైవేటు వ్యక్తుల మధ్య స్థల వివాదం

కాకినాడ నగరంలో నాగమల్లి తోట జంక్షన్ సమీపంలో 119 ఏళ్ల క్రితం ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో జంతు హింస నివారణ సంఘం (ఎస్‌పీసీఏ) 1906లో స్థాపితమై 1972లో (91/1972) రిజిస్టర్ అయింది. అప్పట్లో పిఠాపురం మహారాజా, భాస్కర్ రావు ఆధ్వర్యంలో సొసైటీ ఏర్పాటు చేసి స్థలం కొనుగోలు చేసి పశువుల సంరక్షణ కోసం ఎస్‌పీసీఏ ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా జంతు సంరక్షణ నిర్వహణ జరుగుతోంది. ఇది ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన సంస్థ. దీనికి సంబంధించి 4ఎకరాల స్థలం ఉంది. ఇందులో కొన్ని మూగజీవాలను తీసుకొచ్చి ఆశ్రయం కల్పిస్తుంటారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనల కారణంగా జిల్లా ఉన్నతాధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకుని మరొక సంస్థకు అప్పగించి కమిటీవేశారు. ముందు పనిచేసిన సంస్థ కోర్టుకు వెళ్లడంతో విషయం కోర్టులో నలుగుతోంది. దీనిపై రెండు వర్గాలు ఇది మాదంటే మాదని వివాదానికి దిగుతున్నారు. ఆ స్థలం మీద ఉన్న ప్రేమ మూగజీవాలపై ఆ సంస్థలకు లేదన్న విమర్శలున్నాయి. దీంతో ప్రైవేట్ పార్టీల మధ్య జరుగుతున్న ఈ స్థల వివాదం పట్టించుకోకుండానే కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.2.72కోట్లు ఈ స్థలం అభివృద్ధికి గ్రౌండ్ ఫ్లోరింగ్‌కి రూ.1.72కోట్లు, సిమెంట్ డ్రైన్లు నిర్మాణానికి రూ.23లక్షలు, షెడ్లు నిర్మాణానికి రూ.77లక్షలు నిధులు మూగజీవాల సంక్షేమానికి స్వయంగా ఉన్నతాధికారులు కేటాయించడం దీనికి సంబంధించిన మంజూరులను చకచకా ముందుకు తీసుకెళ్లడం వాళ్లు కేటాయించడం వెనుక పెద్ద మతలబు ఉందని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎన్ని ఆరోపణలు వచ్చినా ఎవరు అడిగినా ఏమీ తెలియదు అన్నట్లుగా జిల్లా అధికార యంత్రాంగం ఈ వ్యవహారాన్ని శరవేగంగా ముందుకు తీసుకెళ్తోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోపణలకు తావిస్తోంది. కేవలం నిధులు నొక్కడానికి అధికారులు కొందరు ప్రైవేట్ వ్యక్తులు కలిసి డబ్బును తమ జేబులో నింపడానికి ఈ ప్రైవేట్ స్థలానికి నిధులు కేటాయించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిజాలు నిగ్గుతేల్చాలని..

ప్రభుత్వానికి సంబంధించిన స్థలాలు, కార్యక్రమాలు ఉండగా ఉపయుక్తమైన భవనాలను నిర్మించాల్సిన అవసరం ఉండగా వాటన్నింటినీ గాలికి వదిలేసి కోర్టు గొడవల్లో ఉన్న ఒక ప్రైవేట్ సొసైటీకి చెందిన స్థలానికి ప్రభుత్వ నిధులు

గతంలో ఈ తరహా ఘటన..

గతంలో కూడా ఇదే రీతిలో బాలాజీ చెరువు సెంటర్‌లో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఉన్న అన్ని మతాలకు సంబంధించిన ఒక ఆలయంలో కాకినాడ అర్బన్ డెవలప్ అథారిటీ నుంచి రూ.50లక్షలు వెచ్చించి ఆధునికీకరించారు. పనులన్నీ పూర్తయిన తర్వాత పిఠాపురం మహారాజా వంశస్తులు ఆలయం వారికి సంబంధించినది అంటూ కోర్టులో కేసు వేశారు. దీంతో రూ.50లక్షలు నిధులు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. అదే రీతిలో ఎస్‌పీసీఏను కౌడా నిధులు రూ.2.72కోట్లతో అభివృద్ధి చేసిన తర్వాత కోర్టు సంస్థకు అనుకూలంగా తీర్పు ఇస్తే పరిస్థితి ఏంటని పలు ప్రశ్నలు ఎదురవుతున్నాయి.



ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్ షాన్‌మోహన్

ఈవీఎంలకు పటిష్ట భద్రత

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీప్యాట్‌లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లోఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్, రెవెన్యూ, ఎన్నికల శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా ఈవీఎం, వీవీప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లకు పటిష్టభద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు
- 'ఉల్లాస్'పై సమన్వయ సమావేశం

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో అడల్ట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్‌ఆల్ ఇన్ సొసైటీ ఉల్లాస్ పథకంపై జిల్లాస్థాయి సమన్వయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో వెంకట్రావు మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా ఉల్లాస్ పథకాన్ని రూపొందించిందన్నారు. దేశంలో 100శాతం అక్షరాస్యతను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. 15ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉండి చదువు ఆపేసిన లేదా చదువుకోని పెద్దలను గుర్తించి అక్షరాస్యతను అందించి వారికి ప్రాథమిక విద్య డిజిటల్ విద్య, ఆర్థిక విద్యను వలంటీర్ టీచర్ ద్వారా అందించడమే ఉల్లాస్ పథక లక్ష్యమన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులను గుర్తించడానికి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు, 20మండలాల్లో 26,014 మంది నిరక్షరాస్యులను గుర్తించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈనెల 24 వరకు డీఆర్డీఏ, మెప్మా క్లస్టర్ కోఆర్డినేటర్, విలేజ్ ఆర్గనైజేషన్, రిసోర్స్‌పర్సన్ ఆధ్వర్యంలో నిరక్షరాస్యుల సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. మే 5 నుంచి సెప్టెంబర్ 18 వరకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం,జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య నిరంతర విద్య వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా తరగతులు పూర్తిచేసుకున్న వారికి సెప్టెంబర్‌లో అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్‌స్కూల్ ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈపథకానికి సంబంధించి జిల్లాస్థాయి కమిటీలో చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరించనున్నారన్నారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా నోడల్ అధికారి వెంకటేశ్వరరావురెడ్డి, డీపీవో రవికుమార్, సమాచార పౌరసంబంధాల డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున పాల్గొన్నారు.

ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేస్తాం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. రబీ 2024-25 సీజన్ ధాన్యం సేకరణకు సంబంధించి బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార, రైస్‌మిల్లర్లతో ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస మద్దతు ధరపై రైస్‌మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 225 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతుసేవాకేంద్రంలోని టెక్నికల్ అసిస్టెంట్ రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించి డేటాఎంట్రీ ఆపరేటర్‌ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెహికల్ మూమెంట్ జీపీఎఫ్ ట్రాక్ చేసి మిల్లుకు పంపిస్తున్నామన్నారు. జిల్లాలో నేటివరకు 300మంది రైతులనుంచి 30 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. డీఆర్వో వెంకట్రావు, పౌరసరఫరాల సంస్థ డీఎం దేవులానాయక్, డీఎస్‌వో సత్యనారాయణ రాజు, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, పాడా పీడీ చైత్రవర్షిణి పాల్గొన్నారు.

సెలవులో జేసీ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జేసీ రాహుల్‌మీనా వివిధ పనుల నిమిత్తం ఈనెల 15నుంచి సెలవులో ఉన్నారు. ఆయన ఈనెల 21న తిరిగి విధుల్లో చేరుతారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శంఖవరం, హంసవరం ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 20న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షను ఈస్టర్ పర్వదినం సందర్భంగా 21వ తేదీకి మార్చినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. విద్యార్థులు గమనించాలన్నారు.

కాకినాడలో తెలుగు నాటక రంగ దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిసందర్భంగా కాకినాడలోని ది యంగ్ మ్యాన్స్ హ్యాపీక్లబ్ ఆధ్వర్యంలో తెలుగునాటక రంగ దినోత్సవాన్ని బుధవారం రాత్రి దంటుకళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు దంటుసూర్యారావు స్మారక ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారంతో సత్కరించారు.



ఎమ్మెల్యే నెహ్రూ, మణి దంపతులకు దంటు సూర్యారావు స్మారక ప్రతిభా మూర్తి జీవితకాల సాధన కళా పురస్కారం అందజేసి సత్కరిస్తున్న దృశ్యం



బాలల అక్రమ రవాణా నాటిక ప్రదర్శిస్తున్న శంఖవరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా విషాదం



- బైక్‌ను లారీ ఢీకొనడంతో యువకుడి మృతి
- మరో యువకుడికి గాయాలు
- న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబీకుల ఆందోళన



వెంకటనగరం వద్ద మృతిచెందిన వీరబాబు (ఫైల్‌ఫొటో)

ప్రత్తిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వెంకటనగరం వద్ద బుధవారం సాయంత్రం బోర్‌వెల్ లారీ మోటార్‌బైక్‌ను ఢీ కొన్న ఘటనలో యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అందించిన మేరకు... ప్రత్తిపాడు మండలంలోని చింతలూరు గ్రామానికి నందవరపు వీరబాబు(20), నందవరపు కృష్ణలు బుధవారం మోటార్ బైక్‌పై శంఖవరం మండలం కొత్తూరు గ్రామం వెళ్లారు. అక్కడ వివాహ వేడుకలో పాల్గొని సాయంత్రం 3.30గంటల సమయంలో స్వగ్రామం చింతూరుకు బైక్‌పై బయలుదేరారు. వెంకటనగరం గ్రామ సమీపంలోని చెరువు వద్ద కోళ్లఫారం వద్దకు చేరుకోగానే ఎదురుగా చింతలూరు నుంచి కత్తిపూడి వైపు వెళ్తున్న బోర్‌వెల్స్ లారీ ఢీ కొంది. ఈ ఘటనలో వీరబాబు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన కృష్ణను అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. వీరబాబు చింతలూరు గ్రామానికి నందవరపు రాము దంపతుల రెండో కుమారుడు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. పెదనాన్న నందవరపు బైరాగి కుమారుడైన కృష్ణతో మోటార్‌బైక్‌పై కొత్తూరుకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో చింతలూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరయ్యారు. మృతుల కుటుంబీకులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కడుపునొప్పని వెళ్తే ప్రాణంపోయింది!

వ్యక్తి మృతిపై బంధువుల ఆందోళన

వైద్యులు, సిబ్బందే కారణమని యానాం ప్రభుత్వాసుపత్రి వద్ద బైఠాయింపు



యానాంలో ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు



మరణించిన శ్రీనివాస్ (ఫైల్)



శ్రీనివాస్ కొడుకు, కుమార్తె

యానాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో అయ్యన్ననగర్‌కు చెందిన పొన్నాడ శ్రీనివాస్ (32) మృతికి యానాం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బందే కారణమని బంధువులు ఆందోళనకు దిగారు. మంగళవారం రాత్రి శ్రీనివాస్‌కు కడుపునొప్పి రావడంతో యానాం ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. వైద్యులు పరిశీలించి మందులు ఇవ్వడంతో ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం అర్ధరాత్రి నొప్పి తీవ్రంగా రావడంతో ఆసుపత్రికి రాగా మళ్లీ చికిత్స అందించారు. అనంతరం కాకినాడకు రిఫర్ చేయాలని వైద్యులు సూచించినా అంబులెన్సు సిబ్బంది సరైన సమయానికి అంబులెన్స్ రాకపోవడం, రోగి కూడా నర్సుకుడా రాకపోవడం తదితర కారణాలతో శ్రీనివాస్ మార్గమధ్యలో మృతిచెందినట్టు బంధువులు ఆరోపించారు. అనంతరం మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచారు. శ్రీనివాస్ మృతికి యానాం ఆసుపత్రి సిబ్బందే కారణమని శ్రీనివాస్ కుమార్తె జోశ్న (5), కుమారుడు వీరాట్ (3)తో కలిసి బంధువులు ఆసుపత్రి వద్ద బైఠాయించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో మత్స్యకార సంఘ నాయకులు మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణ తదితరులు ఆసుపత్రి వద్దకు వచ్చి ఆందోళనకారులు, ఆసుపత్రి డీడీతో మాట్లాడారు. త్రిమెన్ కమిటీ వేసి విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీడీ తెలపడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శ్రీనివాస్ మృతిపై అతడి భార్య శివగంగ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ ఘటనలో...

నిందితుడి అరెస్టు

అన్నవరం/శంఖవరం ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నలుగురు సీఐలు, 10మంది ఎస్ఐలు, 40మంది సిబ్బంది కేసును చేధించేందుకు టీంగా ఏర్పడ్డారు. నిందితుడైన శంఖవరానికి చెందిన పడాల వాసు (20)ను అరెస్టు చేశారు. వాసు దుందుడుకు స్వభావం కలవాడు. కొద్దిరోజులక్రితం ఎస్సీకాలనీలో కొంతమందితో తోపులాటలు జరగగా పెద్దలు రాజీకుదిర్చారు. అది వాసుకు నచ్చకపోవడంతో అంబేడ్కర్ జయంతిరోజున వివాదం సృష్టించాలని ప్రయత్నించి పోలీస్ బందోబస్తు అధికంగా ఉండడంతో వీలు పడలేదని, అర్ధరాత్రి దాటిన తరువాత పథకం ప్రకారం పాతరబ్బరు చెప్పు, ఇంట్లో ఉన్న తాడుతో దండగా కట్టి విగ్రహంపై వేశాడు అని ఎస్ఐ పేర్కొన్నారు. దీనిపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నామని చెప్పారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

తుని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న యువకుడు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనకాపల్లి జిల్లా పెంటకోట గ్రామానికి చెందిన కర్రి లక్ష్మణ్ తుని డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల బయట పురుగుల మందు తాగడం గమనించిన తోటి విద్యార్థులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో విద్యార్థి కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు.



చికిత్స పొందుతున్న లక్ష్మణ్

భూగర్భ జలాలు పెంచే యజ్ఞం!

- నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు
- జూన్ నెలాఖరు నాటికి పూర్తిచేయడమే లక్ష్యం



కోటనందూరు మండలం ఎస్‌ఆర్‌పేటలో నీటికుంట ఏర్పాటు చేస్తున్న దృశ్యం(ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపుతో సాగు, తాగునీటి సమస్యను తీర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యజ్ఞంలా ఫారం పాండ్స్ (నీటి కుంటలు) ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. భూమిలో తేమశాతం సంరక్షించాలన్న లక్ష్యంతో తవ్వకాలు చేపట్టింది. ప్రతి పంచాయతీలో పదికి తగ్గకుండా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉండడంతో వీటికి నిధులు విడుదల చేయడం తో పాటు పనులు వేగవంతంగా జరగాలని ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమం కూడా చేపట్టారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నీటికుంటల పనులు ఊపందుకున్నాయి. రాష్ట్రంలో లక్షా 55 వేలు నీటి కుంటల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించారు. అలాగే జిల్లాలో కూడా వీటి ఏర్పాటుకు ఒక నిర్దిష్టం సంఖ్య ఏర్పాటు చేసి ఉపాధి నిధులతో పనులు చేపడుతున్నారు. జూన్ నెలాఖరు నాటికి పనులు పూర్తిచేయాలని ఆదేశాలు ఉండడంతో అందుకనుగుణంగా పనులు జరుగుతున్నాయి.

ఉపయోగాలివే...

రైతుల పొలంలో నీటికుంటలు తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు పెంచడంతో పాటు, భూమిలో తేమ శాతం, పశువులకు తాగునీరు, పంటలకు పురుగు మందుల పిచికారీకి నీరు, అందుబాటులో ఉంటుంది. బోరు బావి దగ్గర్లో ఏర్పాటు చేస్తే నీటి శాతం పెరుగుతోంది. దీంతో రైతులను చైతన్యపరిచి నీటికుంటలు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నా రు. నీటకుంటలు సైజు ఆధారంగా రేట్లు ఉంటా యి. తక్కువ ఖర్చుతో ప్రయోజనకరంగా ఉండేందుకు వీలుగా పొలాల్లో 8 మీటర్లు వెడల్పు, 8మీటర్లు పొడవుకు 2మీటర్లు లోతుకు 128 చదరపు మీటర్లు నీటికుంటకు రూ.38,400 ఉపాధి నిధులను ఖర్చు అవతుంది. అలాగే పలు రకాలుగా పొడవు, వెడల్పుతో నీటికుంటలు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నదాతలకు అవగాహన

నీటి కుంటల ఏర్పాటుపై అన్నదాతలకు అధికారులకు అవగాహన కల్పించి తద్వారా ఏర్పాటుకు ముమ్మరంగా పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం వైసీపీ వీటిని నిర్లక్ష్యం చేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నీటి కుంటల ఏర్పాట్లు ముందుకు సాగుతున్నాయి. సాగునీటి వనరులు పెంచే లక్ష్యంతో అధి కారులు అడుగులువేస్తున్నారు. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాలో 2500 నీటి కుంటల ఏర్పాటు లక్ష్యం కాగా అందులో రూ.25 కోట్లతో పనులు చేపడుతున్నారు. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో 1500 నీటికుంటల ఏర్పాటు లక్ష్యం కాగా... రూ.4.50కోట్లు నిధులు ఇచ్చారు. ఇప్పటి వరకూ 1166 గుర్తించగా అందులో 138 పూర్తిచేశారు. ఒక్కోటి అంచనా వ్యయం రూ.25 వేల నుంచి 35వేలు అని చెప్పవచ్చు. అనుకున్న లక్ష్యం ప్రకారం మొత్తం జూన్ నెలఖారు నాటికి నీటి కుంటలు పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి.

రైతులు ఉపయోగించుకోవాలి

నీటికుంటల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నాం. కాకినాడ జిల్లాలో 2500 నీటికుంటలు ఏర్పాటుచేసి జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసి రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా చేస్తున్నామన్నారు. ప్రతి రైతు ఉపయోగించుకోవాలి.

-అడపా వెంకటలక్ష్మి, పీడీ, ఉపాధి హామీ పథకం, కాకినాడ

రెండో రోజూ...

- కాకినాడలో కొనసాగిన ఏపీఎస్పీ రేంజ్ 1 క్రీడాపోటీలు
- నేడు ముగింపు కార్యక్రమం
- అతిథులుగా బెటాలియన్స్ ఐజీపీ రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప



పరుగు పందెం



కబడ్డీ పోటీ



హైజంప్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గ్రా మ పంచాయితీ పరిధిలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో నిర్వహిస్తున్న ఏపీఎస్పీ రేంజ్ 1 గేమ్స్, క్రీడాపోటీలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు క్రీడా పోటీలను పరిశీలించారు. 3రోజుల పాటు జరిగే పోటీల్లో కాకినాడ 3వ బెటాలియన్‌తో పాటూ విజయనగరం నుంచి 5వ బెటాలియన్, మంగళగిరి నుంచి 6 బెటాలియన్, విశాఖపట్నం నుంచి 16 బెటాలియన్‌కు చెందిన పోలీస్ క్రీడాకారులు చెస్, క్రికెట్, కబడ్డీ, హైజంప్, 1500, 200, 5000 మీటర్లు పరుగు, మారథాన్ వంటి క్రీడల్లో పాల్గొన్నారు. గేమ్స్, క్రీడా పోటీలు గురువారం ముగియనుండగా ఈ కార్యక్రమంలో బెటాలియన్స్ ఐజీపీ బి.రాజకుమారి, డీఐజీ కె.ఫకీరప్ప ముఖ్య, గౌరవ అతిథులుగా పాల్గొంటున్నారని 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు తెలిపారు.

విజేతల వివరాలు

క్రీడాపోటీల్లో భాగంగా రెండో రోజు నిర్వహించిన హైజంప్ పోటీలో పి.ప్రసాదరావు, వి.సుధాకర్, జి.శ్రీను ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. అదేవిధంగా 1500 మీటర్ల పరుగు పోటీలో ఎస్.సురేష్‌కుమార్, కె.రాజనాయుడు, పి.సత్యారావు మొదటి మూడు స్థానా లు కైవసం చేసుకున్నారు. 200 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, జి.శ్రీను, జి.మురళీ ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగాను, 5000 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, వై.సత్యారావు, రాజినాయుడు మొదటి 3 స్థానాల్లో నిలిచారు. మారథాన్‌లో ఎం.లక్ష్మణ్, టి.శ్రీనివాసరావు మొదటి, రెండు స్థానాల్లో, చదరంగంలో శివకుమార్, శ్రీను మొదటి, రెండు స్థానాలు గెలుపొందగా, కబడ్డీలో 16వ ఏపీఎస్పీ జట్టు విన్నర్‌గానూ, 5వ ఏపీఎస్పీ జట్టు రన్నర్‌గానూ నిలిచాయి. అలాగే క్రికెట్‌లో 3వ బెటాలియన్ ఏపీఎస్పీ జట్టు ప్రథమ, 6వ బెటాలియన్ ఏపీఎస్పీ జట్టు ద్వితీయ విజేతగా నిలిచాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సురేష్ (ఫైల్)

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాంలో బుధవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మరణించాడు. గ్రామానికి చెందిన పల్లపు సురేష్‌బాబు(37) అదే గ్రామంలో ఓ ఇంటికి ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం వెళ్లాడు. మోటార్‌కు కనెక్షన్ ఇస్తుండగా కరెంటు షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. అతడికి భార్య మణి, 10వతరగతి చదువుతున్న కుమారుడు సంజయ్, 8వ తరగతి చదువుతున్న కుమార్తె సరిత ఉన్నారు. విషయం తెలుసుకున్న సురేష్ కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పిఠాపురం మార్చురీలో భద్రపరిచారు.

రోడ్డు ప్రమాదంలో మృతులకు ముగిసిన అంత్యక్రియలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జనగామ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన సత్తి శ్రీను (50), సత్తి రమణకుమారి (45), సత్తి అనూష(22) అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలకు జనగామ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బుధవారం ఉదయం వారి మృతదేహాలు స్వగ్రామం కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెం గ్రామానికి చేరుకోగా ఆ వెంటనే బంధువులు, స్నేహితుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అదే కుటుంబానికి చెందిన సత్తి రాజేశ్వరరావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్‌లు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో ఇంకా చికిత్స పొందుతున్నారు.

బాలికపై అత్యాచారం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన బుధవారం కాకినాడలో జరిగింది. నగరానికి ఓ మహిళ చేపలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు 16 ఏళ్ల కుమార్తె ఉంది. కాగా ఆమె భర్త కొంత కాలం క్రితం చనిపోవడంతో లోకేశ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తుంది. ఈ క్రమంలో బుధవారం ఆ మహిళ బయటకు వెళ్లింది. ఆమె కుమార్తె ఇంటిలో ఉన్న సమయంలో లోకేశ్ ఇంటిలోకి వెళ్లి నిద్రిస్తున్న ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన తల్లితో ఆ బాలిక విషయాన్ని చెప్పింది. మహిళ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

రాయవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడు తేతలి శ్రీనివాసరెడ్డిపై రాయవరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బుధవారం శ్రీనివాసరెడ్డిని అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు.

దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు

రూ.5 లక్షల విలువైన వైద్యం

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి



కడియపుసావరంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

కడియం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలకు రూ.5 లక్షల విలువైన వైద్యం అందించేలా ఆయుష్మాన్‌భవ, ప్రతీ గ్రామానికి సురక్షితమైన తాగునీరు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో వాటర్‌ట్యాంకుల ఏర్పాటుతో పాటు ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా నీరు అందించే విధంగా జలజీవన్ మిషన్ పథకాలను కేంద్రప్రభుత్వం అమలుచేస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా కడియపుసావరంలో నిర్మించిన సచివాలయం, 2 వాటర్ ట్యాంకులు, పేపరుమిల్లు సమకూర్చిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి పురందేశ్వరి ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ.11వేల కోట్లు ఇస్తుందన్నారు. అందులో భాగంగానే రూ.4,285 కోట్లు కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందన్నారు. పోలవరం నిర్మాణానికి రూ.12,500 కోట్లు ఇవ్వడానికి కేంద్రం ముందుకొచ్చిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన కాకుండా లాభాల్లోకి తీసుకురావాలనే విషయం మీద దృష్టిపెట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలకు వారి పరిధిలో సుమారు 150 నుంచి 200 గ్రామాలు ఉంటాయని, అదే ఎంపీకి వారి పరిధిలో సుమా రు 1000 గ్రామాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యేల సహకారంతో స్థానికంగా సమస్యలు గుర్తిం చాలని ఆ సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పరిదిలో ఆయా శాఖల మంత్రులతో చర్చించి పరిష్కరించి అభివృద్ధి చేయడానికి కృషి చేయవచ్చన్నారు. పేపరుమిల్లు ఈడీ ముఖేష్‌జైన్, సీఎస్ బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రూ. 2,900 కోట్లతో పరిశ్రమను విస్తరిస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వరగోగుల వెంకటేశ్వరరావు, వెలుగుబంటి నాని, ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, వరగోగుల సత్యనారాయణ, సీఎస్ఆర్ మేనేజర్ దాసరి తాతారావు పాల్గొన్నారు.

ఇంటర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో

స్టేట్ టాపర్‌కి మంత్రి అభినందన



సాయిలక్ష్మి, ఆమె తల్లిదండ్రులకు ల్యాప్ టాప్ అందజేస్తున్న మంత్రి లోకేశ్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థిని డి.సాయిలక్ష్మి ఎలక్ట్రానిక్స్ విభాగంలో 1000కి 982 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అమరావతిలో జరిగిన షైనింగ్ స్టార్స్-25 కార్యక్రమంలో ఆమెకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బంగారు పతకం, ల్యాప్‌టాప్ అందజేశారు. సాయిలక్ష్మి, ఆమె తల్లిదండ్రులను సత్కరించారు. భవిష్యత్తులో ఏమవు దామునుకుంటున్నావని ఆ విద్యార్థినిని లోకేశ్ అడగ్గా డిగ్రీ పూర్తి చేసి గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేరవుతానని తెలిపింది. ఆమెను ప్రభుత్వమే ఉచితంగా చదివిస్తుందని ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి తెలిపారు. సాయిలక్ష్మిని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనరు కృతికా శుక్లా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు పీవీ శివప్రసాద్, నిరంజన్‌కుమార్ అభినందించారు.

ఇంటి నుంచే పౌరసేవలు

మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం



సామర్లకోట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద నుంచే పౌరసేవలు వినియోగించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఒకడుగు ముందుకేసింది. ప్రభుత్వం తాజాగా ప్రారంభించనున్న ఇంటి నుంచే పౌరసేవలు పొందేందుకు బయటకు రావాల్సిన అవసరం లేకుండా ఒకే వాట్సాప్ మెసేజ్‌తో పౌరసేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర అనే నూతన వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, మరో 2,3 రోజుల్లో వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం కాగలదని విశ్వసనీయ సమాచారం. ఈ వేదిక ద్వారా ప్రజలు ప్రస్తుత ధృవపత్రాలు, లైసెన్స్‌లు, పన్నుల చెల్లింపులు, బిల్లులు, దేవాలయ దర్శనాలు, పరీక్షల ఫలితాలు, వంటి 250కు పైబడి సేవలను పొందవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 12 నాటికి 500 సేవలు, ఏడాది చివరకు వేయి రకాల సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రజలందరూ వినియోగించుకుని తమకు కావాల్సిన పౌరసేవలను త్వరితగతిన పారదర్శకంగా పొందేలా ప్రభుత్వం నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టనుంది.

ప్రభుత్వాసుపత్రిలో యువకుల హల్‌చల్



రోగులతో మాట్లాడుతున్న యువకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో బుధవారం కొందరు యువకులు హల్‌చల్ చేశారు. ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్ వార్డుల్లో కలియదిరుగుతూ అక్కడి రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలపై ఆరా తీశారు. వీడియోలు తీసుకున్నారు. ఆసుపత్రిలో రోగుల పరిస్థితి దారుణంగా ఉందని, పడుకునేందుకు బెడ్స్ లేవని, కరెంట్ లేదని తదితర సమస్యలను ప్రస్తావిస్తూ వీరసింగం అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్టు పెట్టాడు. ఆ పోస్టు బుధవారం కొంత వైరల్ కావడంతో మాజీ ఎంపీ భరత్‌రామ్, కొన్ని మానవహక్కుల సంస్థల ప్రతినిధులు ఆసుపత్రికి వచ్చి పరిశీలించారు. ఇదే సమయంలో వీడియో పోస్టుపెట్టిన వీర సింగం అనే యువకుడు, అతడితోపాటు మరికొందరు యువకులు ఆసుపత్రికి చేరుకున్నారు. వారంతా ఆసుపత్రిలోకి ప్రవేశించి వార్డుల్లో కలియదిరిగారు. రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలు ఎలా అందుతున్నాయంటూ ఆరా తీశారు. నర్సింగ్ స్టాఫ్‌ను సైతం ప్రశ్నించడం గమనార్హం. ఒక పక్క మాజీ ఎంపీ భరత్‌రామ్, మరోపక్క ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టిన యువకుడు, అతడి వెంట వచ్చిన వారు వార్డుల్లో తిరిగారు. సుమారు 2 గంటలసేపు ఈ తతంగమంతా సాగింది. ఇంత జరుగుతున్నా ఆసుపత్రి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది కానీ స్పందించకుండా చోద్యం చూస్తూ కూర్చున్నారు. ఇన్‌పేషెంట్ రోగులను కలిసేందుకు నిర్ణీత సమయంలోనే అనుమతిస్తామంటూ హుకుం జారీ చేసిన ఆసుపత్రి అధికారులు ఈ విషయంపై నోరుమెదపకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కొత్తగా ట్రైన్



సాధారణంగా రైలు పట్టాలపై ట్రైన్ ఇంజన్లు వెళ్తుంటాయి. కానీ ట్రైన్ ఇంజన్ రోడ్డుపై కనిపిస్తే.. అదీ కూడా ట్రాలీ మీద ఉంటే ఎవరిచూపైనా పడాల్సిందే. అటువంటి దృశ్యమే కాకినాడ జిల్లా గండేపల్లిలో కనిపించింది. హైవేపై ట్రాలీ మీద ట్రైన్ ఇంజన్ తీసుకెళ్లడంతో స్థానికులు చూసి కొంచెం కొత్తగా ఉందని ఫొటోలు తీసుకున్నారు.

గండేపల్లి(ఆంధ్రజ్యోతి)

నూకాలమ్మ హుండీల ఆదాయం రూ.11.81 లక్షలు

పెద్దాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో హుండీలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. అమ్మవారి జాతరకు సంబంధించి 34 రోజులకు రూ.11,81,458 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి సౌజన్య తెలిపారు.

గిట్టుబాటు ధర లేదు... కొనేవారూ లేరు

పిఠాపురం మహారాజా వారధి పరిసర ప్రాంత రైతుల ఆవేదన



పిఠాపురం పట్టణ శివారులో ధాన్యం రాశుల వద్ద తమ పంట కొనుగోలు చేయాలని కోరుతున్న రైతులు

పిఠాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక, కొనేవారు ముందుకు రాక దాళ్వా వరి సాగు చేసిన తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పిఠాపురం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పండించిన పంటలు కొనుగోలు చేయాలంటూ వారు పట్టణ శివారులోని మహారాజా వారధి, పరిసర ప్రాంతాల్లో ఉన్న ధాన్యం రాశులను చూపిస్తూ ప్రభుత్వాన్ని, జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు. మహారాజా వారధి పరిసర ప్రాంతాల్లో రెండు వేల ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేశారని మహారాజా వారధి ప్రాంత పరిరక్షణ సమితి కో-ఆర్డినేటర్ యనమండ్ర సూర్యనారాయణ, ఇతర రైతులు తెలిపారు. 15 రోజులుగా మాసూళ్లు జరుగుతున్నా ఇప్పటివరకు తమ వద్ద నుంచి ఒక ధాన్యం గింజ కూడా కొనలేదన్నారు. దీంతో ధాన్యం రాశులను కళ్లాల్లోనే ఉంచేశామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించకపోగా, 75 కిలోల బస్తాకు రూ.200 నుంచి 300కు తక్కువకు అమ్మాలని అడుగుతున్నారని వివరించారు. మరోవైపు మారుతున్న వాతావరణ పరిస్థితులతో కంటి మీద కునుకు కరువైందన్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోగా ఆరబెట్టుకున్నామని, రెండు రోజులుగా మేఘాలు అలముకుని చిరుజల్లులు పడుతున్నాయని చెప్పారు. మరలా వర్షం కురిస్తే ధాన్యం పూర్తిగా తడిసిపోయే ప్రమాదముందని అందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్, ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతుల వద్ద ఉండిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

‘కూటమి ప్రభుత్వంతోనే ఎస్సీల అభివృద్ధి’



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్లను పూర్తి గా నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు పేర్కొన్నారు. కాకినాలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ రుణాలను ఎస్సీలు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలన్నారు. ఎస్సీ వర్గీకరణలో ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రభుత్వం వ్యవహారం చేస్తోందని, తద్వారా దళితులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు చవిల కొండబాబు, బుంగా నాగరాజు, కాకర శ్యామ్, తూళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

1న విజయవాడలో కార్మిక బహిరంగ సభ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫణేశ్వరరావు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా వచ్చే నెల 1వ తేదీన విజయవాడలో 10వేల మందితో కార్మిక బహిరంగ సభ నిర్వహించనున్నామని టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు జోన్-2 ఇన్చార్జి సబ్బతి ఫణేశ్వరరావు వెల్లడించారు. బుధవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జోన్-2 పరిధిలోని ఐదు పార్లమెంట్, 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మేడే వేడుకలు నిర్వహిస్తామ న్నారు. విజయవాడలో టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. విలేకరుల సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు జక్కి అప్పన్న, యజ్జల బాబ్జీ, బలగం పరశురామ్, భావన, సత్యవేణి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో భవానీకి చోటు



బ్రదర్ అనిల్‌కుమార్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న భవానీ

కరప, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేళంగికి చెందిన టెక్కలి వీరకన్య భవానీ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. విజయవాడలో గత ఏడాది డిసెంబరు 1న హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ బృంద సంగీత విభావరి జరిగింది. ఇందులో 1,046 మంది యువతులు పాల్గొని పియానో వాద్య పరికరంతో ఒక గంటలో అత్యధిక ప్రదర్శనలు చేసి ఆ వీడియోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఈ ఘనత సాధించినవారిలో వీరకన్యభవానీ ఒకరు. ఈ నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్రదర్ అనిల్‌కుమార్, సంగీత గురువు పాస్టర్ అగస్టిన్, దండంగి వేణుగోపాల్ నుంచి భవానీ గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా భవానీ మాట్లాడుతూ ఇది తన జీవితంలో చిరస్మరణీయమైన ఘట్టమన్నారు. పాస్టర్ అగస్టిన్ ఉచిత సంగీతాభ్యాస శిక్షణ వల్ల ఈ ఘనత సాధించగలిగినట్టు ఆమె పేర్కొన్నారు. గిన్నిస్ రికార్డులో చోటుదక్కించుకున్న భవానీని గ్రామస్థులు, కుటుంబసభ్యులు, మిత్రులు అభినందించారు.

కళ్లను సంరక్షించుకోవాలి: డాక్టర్ తేజ



కంటి పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

కరప, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన అలవాట్లు, వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ కళ్లను సంరక్షించుకోవాలని డాక్టర్ తేజ సూచించారు. కరప చిరంజీవి కల్యాణ మండపంలో జనసేన నాయకుడు యాళ్ల వీర వెంకట సత్యనారాయణ (పండు) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. 225 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి మందులు అందజేశారు. వైద్య పరీక్షలు నిర్వహించిన కాకినాడ అంజు కంటి ఆసుపత్రి వైద్య సిబ్బందిని సత్కరించి మెమెంటోలు అందజేశారు. జనసేన నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, ముద్రగడ రమేష్, పేకేటి దుర్గాప్రసాద్, భవానీశంకర్, పేపకాయల అంజి, బద్ది వీరబాబు, చిక్కం భగవాన్, సతీష్, శ్రీకృష్ణ, భగవాన్, చిన్నారి శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి’



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పెద్దాపురం ని యోజకవర్గ స్థాయి పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి బుధవారం టీడీపీ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు రాజా సూరిబాబు రాజు, అడబాల కుమారస్వామి, మండల శాఖల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామర్లకోటలో సామూహిక సీమంతాలు



సామర్లకోట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో అమ్మ భగవాన్ సేవా సమితి సౌజన్యంతో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సామర్లకోట సామాజిక ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అమల అభినందించారు. డాక్టర్లు వరలక్ష్మి, సంతోషలక్ష్మి పర్యవేక్షణలో సుమారు 45 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. హెడ్ నర్స్ ఎం.వరలక్ష్మి, సేవా సమితి సభ్యులు విజయలక్ష్మి, అనంతలక్ష్మి, వాణి, అనిత నూకరాజు, రమణమూర్తి, వెంకటలక్ష్మి, రమేష్, సత్యానందం, కాకినాడ విజయ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పెద్దాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టం అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. బుధవారం వారు మండల పరిషత్ కార్యాలయ ఏవో ఎం.సత్యనారాయణమూర్తి, ఉపాధి హామీ కార్యాలయ ఏపీవో సుధీర్‌లకు వినతిపత్రం అందజేశారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు, డిమాండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 28వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఫీల్డ్ అసిస్టెంట్లు హెచ్చరించారు. బుధవారం వారు గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్నను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ నెల 21న పనులు నిలిపివేసి పెన్‌డౌన్ పాటిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకు దిగడం తప్ప ప్రత్యామ్నాయం లేదని తెలిపారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

కొత్తపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణం దోమాడకు చెందిన వేద పండితుడు వీరాచారి మంత్రోచ్చారణలతో ఘనంగా జరిగింది. కొత్తపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పట్నాల అబ్బు నేతృత్వంలో జరిగిన కల్యాణాన్ని తిలకించడానికి మండలంలోని పలు గ్రామాల నుంచి విశ్వబ్రాహ్మణులు తరలి వచ్చారు. కొత్తపల్లి, పరిసర గ్రామాల ప్రజలు అన్నప్రసాదం స్వీకరించారు.

తాగునీటి సమస్యలపై నిరసన

కరప, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన బుధవారం జరిగిన గ్రామసభలో తాగునీటి సమస్యలపై నిరసన వ్యక్తమైంది. నక్కావారిపేటకు తాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పంచాయతీ సిబ్బంది అసలు పట్టించుకోవట్లేదని జగ్గారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొన్ని ఏరియాలకు మంచినీటి సమస్య ఉందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శిథిలస్థితికి చేరిన నక్కావారిపేట వంతెనను పునర్నిర్మించాలని, పీహెచ్‌సీ ఎదురుగా అంబేడ్కర్ విగ్రహం చెంత బస్ షెల్టర్ నిర్మించాలని 12వ వార్డు సభ్యురాలు జెల్లా లక్ష్మీ వినతిపత్రాలు అందజేశారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అన్ని ఇబ్బందులు తొలగిస్తామని సర్పం చ్ ఆశాజ్యోతి, ఇన్‌చార్జి కార్యదర్శి బ్రహ్మానందం హామీ ఇచ్చారు.

వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని వినతి

పిఠాపురం ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు వారు బుధవారం సాయంత్రం మునిసిపల్ కమిషనరు నామా కనకారావును కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 24, 25, 29 వార్డుల్లో పలు సమస్యలు ఉన్నాయని తెలిపారు. 25వ వార్డులో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, డ్రైన్ ఆక్రమణకు గురయిందన్నారు. 29వ వార్డులో డ్రైన్లల్లో నీరు రోడ్లపై ప్రవహిస్తోందని, దీంతో దోమల బెడద అధికమై ప్రజలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. అంతకు ముందు 25వ వార్డులో పర్యటించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జనసేన నాయకులు సూరవరపు సురేష్, కరణం సూరిబాబు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

సామర్లకోట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సౌజన్యంతో పట్టణంలోని రైతు భవన్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. జిల్లాలో అధికంగా వున్న తలసేమియా బాధితుల అవసరాల దృష్ట్యా రెడ్‌క్రాస్‌లో రక్త నిల్వలు పెంచేందుకు కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన చెప్పారు.



చెట్లను నరకగా వచ్చిన దుంగలను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

కరప రైల్వే స్టేషన్లో చెట్ల నరికివేత

మూడు రోజులుగా వ్యాన్లలో దుంగల తరలింపు... అక్రమార్కులకు రైల్వే సిబ్బంది సహకారం!

కరప, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ-కోటిపల్లి లైన్‌లో కరప రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే శాఖకు చెందిన పలు ఎకరాల భూమి నిరుపయోగంగా ఉంది. ఈ భూమిలో తుమ్మ, దుర్సెంత, మర్రి వంటి భారీ వృక్షాలు, తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో కొంతమంది అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. రైల్వే శాఖలోని కింది స్థాయి సిబ్బంది సహకరించడంతో రెచ్చిపోయిన అక్రమార్కులు వాటిని తెగనరికి దుంగలను వ్యాన్లలో తరలించుకుపోయారు. దీనిపై కొంతమంది స్థానికులు అడ్డుపడగా తమకు రైల్వే శాఖ అనుమతి ఉందని స్టేషన్ పరిసరాల్లోని చెట్లను నరికి శుభ్రం చేయాల్సి ఉందని సదరు అక్రమార్కులు దబాయించినట్టు తెలిసింది. వాస్తవానికి రైల్వే, అటవీ శాఖల నుంచి వారికి ఎటువంటి అనుమతులూ లేనట్టు తెలుస్తోంది. దీనిపై ప్రసాద్ అనే రైల్వే ఉద్యోగిని ‘ఆంధ్రజ్యోతి’ ఫోనులో సంప్రదించగా తనకేమీ తెలియదని, తన పై ఉద్యోగికి ఫోన్ చేయమని పెట్టేశారు. దీంతో సదరు ఉద్యోగికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు.



ఆర్‌ఎస్ రత్నాకర్ నేతృత్వంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మాల సామాజికవర్గీయులు

‘ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి’

కాకినాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ముసుగులో మాల సామాజికవర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, రాక్స్ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని.. ఏ, బీ, సీ, డీ మాకొద్దు అంటూ బుధవారం ఆయన మాల సామాజికవర్గీయులతో కలిసి ఆందోళన నిర్వహించారు. తొలుత కాకినాడ కలెక్టరేట్ నుంచి జడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మోడీ డౌన్ డౌన్.. చంద్రబాబు, జగన్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినదించారు. అనంతరం రత్నాకర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ఇద్దరూ వర్గీకరణ పేరుతో మాలలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అంబేడ్కర్ జయంతి రోజున ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మంత్రివర్గంలో ఆమోదించారని, రెండు, మూడు రోజుల్లోనే ఆర్డినెన్స్‌ను చంద్రబాబు ప్రభుత్వం తీసుకురానుందన్నారు. ఇంత జరుగుతున్నా మాల సామాజికవర్గీయులు ఎవరిలోనూ చలనం లేదని, రాజకీయ నాయకులు పదవుల కోసం, వారి వ్యక్తిగత స్వార్థాల కోసం అమ్ముడుపోయారని మండిపడ్డారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ప్రదర్శన

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మెయిన్‌రోడ్డులోని జామియా మసీదు నుంచి కలెక్టరేట్ వరకు ముస్లింలు బుధవారం భారీ ర్యాలీ చేపట్టారు. ముస్లిం వక్ఫ్ జేఏసీ కాకినాడ సహ కన్వీనర్ జవహర్ ఆలీ, నజ్మా, ఇమాం గౌస్‌మొహిద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు జేఏసీ నాయకులు జవహర్ ఆలీ, తాజుద్దీన్, అబ్దుల్ బషీరుద్దీన్, రహ్మాన్‌ఖాన్ తదితరులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రహీం, కుతుబుద్దీన్, మాజీ కార్పొరేటర్ తహీరాఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి



జయంతి వేడుకలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను బుధవారం బోట్ క్లబ్ వెనుక ఉన్న చోడే అప్పారావు ప్రకృతి ఆశ్రమం మీటింగ్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మట్ట ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యాజీవేమా, యెనిమిరెడ్డి మాలకొండయ్య, రామ్‌కుమార్, ముత్తా నవీన్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

‘అక్రమ ఆక్వా సాగును అడ్డుకోవాలి’

కరప, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శహపురం డ్రెయిన్ భూములను ఆక్రమించి అక్రమంగా చేపడుతున్న ఆక్వా సాగును అడ్డుకోవాలని పలువురు రైతులు బుధవారం కరప తహసీల్దార్ నందిపాటి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. కొంగోడు గ్రామానికి చెందిన మేడిశెట్టి రామకృష్ణ డ్రెయినేజీ భూములను కలుపుకుని అక్రమంగా ఆక్వా సాగు చేస్తున్నాడని, దీనివల్ల ముంపునీరు పోయేందుకు మార్గంలేక తమ పంట పొలాలు మునిగిపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి అనుమతులు లేని ఈ చెరువులకు ప్రభుత్వ ఉచిత కరెంట్ పొందుతున్నాడని ఆరోపించారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని తమ పంట పొలాలను కాపాడాలని రైతులు జి.సత్యనారాయణ, బాలసూర్యనారాయణ, బుడిత శ్రీను, బి.ఉదయ్‌కుమార్, నక్కా దుర్గారావు, ఎం.గోవిందరాజు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి భారీ జరిమానా

కాకినాడ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి బుధవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు సిబ్బందితో మంగళవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మోతాదు దాటి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 32 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా 20 మందికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 12 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు.



శేఖర్‌కు టీడీపీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా

బచ్చు శేఖర్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా టీడీపీ నాయకుడు బచ్చు శేఖర్ నియమితులయ్యారు. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన శేఖర్ పేరును ఎమ్మెల్యే కొండబాబు ప్రతిపాదించగా టీడీపీ అధిష్ఠానం నుంచి ఆమోదం లభించింది. దశాబ్దానికి పైగా టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న శేఖర్ నియామకంపై పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

కళలతో మనోవికాసం

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కళలకు మూలం నాటకాలు... వీటి ద్వారా మనోవికాసం కలుగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకలను బుధవారం రాత్రి దంటు కళాక్షేత్రంలో క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, అతిథులుగా సరస్వతి గానసభ కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, డాక్టర్ కాద వెంకటరమణ హాజరయ్యారు. చాగల్నాడు భగీరథుడిగా పేర్గాంచిన జ్యోతుల నెహ్రూ-మణి దంపతులకు దంటు సూర్యారావు స్మారక ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం అందజేశారు. పలు సంస్థల కళాకారులు వారిని గజమాలతో సత్కరించారు. పురస్కార గ్రహీత నెహ్రూ మాట్లాడుతూ నాటక సమాజం సామాజిక పరివర్తనకు ఉపయోగపడే సులువైన సాధనమన్నారు. శంఖవరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు బాలల అక్రమ రవాణా నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి పీవీ రావు, కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాసు, ఎంవీ రమణ, పట్నాల రాము, మార్ని జానకిరామచౌదరి తదితరులు పాల్గొన్నారు.

‘సంస్కరణోద్యమ ఖడ్గధారి కందుకూరి’

పెద్దాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నవయుగ వైతాళికుడు, సంస్కరణ ఉద్యమ ఖడ్గదారి కందుకూరి వీరేశలింగం అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ బుధవారం 14వ రోజుకు చేరుకుంది. పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ద శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కందుకూరి జయంతి సభకు కృష్ణబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సాహితీ స్రవంతి పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, జనసేన నాయకుడు లక్ష్మణ్ దివాకర్, చిల్డ్రన్స్ క్లబ్‌కు చెందిన అమృత పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కాకినాడ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో మూడో రోజైన బుధవారం పర్లోవపేటలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో కిచెన్‌లో సంభవించే అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన విషయాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకునే విధానాన్ని, లీక్ అయి మంటలు ఎగసిపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు బృందం అవగాహన కల్పించింది. ఏసీ, గీజర్ వినియోగంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అవుతుందని గృహిణులకు వివరించారు. లీడింగ్ ఫైర్‌మెన్లు డి.వీరబాబు, అనిశెట్టి గందాలరెడ్డి, డి.సముద్రరాజా, సందాని, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పిఠాపురం ఫైర్ ఆఫీసర్ డి.రామకృష్ణరాజు ఆధ్వర్యంలో బుధవారం జగ్గయ్యచెరువు కాలనీలోని రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్ల వాసులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వంట వండే సమయంలో గ్యాస్ వినియోగిస్తుండగా ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలి, ప్రమాదం నుంచి ఎలా రక్షించుకోవాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలను డెమో ద్వారా వివరించారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లావాదేవీలు, రుణాల మంజూరు, చెల్లింపులపై అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతి రిసోర్స్‌పర్సన్ పి.సూర్యనారాయణ, స్త్రీ నిధి ఏజీఎం చిట్టిబాబు సూచించారు. చేబ్రోలులోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏపీఎం సన్యాసిరావు, సీసీలు నాయుడు, రమణ పాల్గొన్నారు.

పెద్దిపాలెం - ఉత్తరకంచి రహదారి పనుల ప్రారంభం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం- ఉత్తరకంచి రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కృషి మేరకు రూ.2.7కోట్లు నిధులు విడుదల కావడంతో బుధవారం ఈ రహదారి నిర్మాణ పనులకు జిల్లా టీడీపీ నాయకుడు రెడ్డి అమర్నాథ్ కొబ్బరికాయ కొట్టిపనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దిపాలెం టీడీపీ నాయకులు రీసు సత్తిబాబు, లొండా వీరబాబు, కె.అప్పారావు, ఆర్.సీతారాం, డి.రమణ పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆదాయం రూ.11.81 లక్షలు

పెద్దాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాండ్రకోట నూకాలమ్మ అలయ కానుకలను లెక్కించారు. జాతరకు సంబంధించి రూ.11,81,458 వచ్చిందని కార్యనిర్వహణాధికారి సౌజన్య తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

• ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా క్వాలిటీ విద్యను అందించాలన్నారు. అన్ని పాఠశాలల్లో నూరు శాతం అడ్మిషన్లు కల్పించి నూతన విద్యావిధానంపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులపై సమీక్షించారు. గిరిజన విద్యార్థులకు ఇంజనీరింగ్, మెడికల్ కళాశాల్లో అడ్మిషన్లు పొందేలా ప్రత్యేక శిక్షణకు ప్రతిపాదనలు జరుగుతున్నాయన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు నైపుణ్యం అభివృద్ధి చేసుకొనే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఐటీడీఏల ద్వారా ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యువో కృష్ణమోహన్, మండల విద్యాశాఖాధికారులు ఎం.సత్యనారాయణ, రామకృష్ణ, బాపన్నదొర, సూరారెడ్డి, ముత్యాలరావు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమశాఖ పర్యవేక్షణాధికారి బి.కిషోర్, గురుకుల సెల్ అధికారి నాగేంద్ర, పీఎంయూ అధికారి చంద్రకళ, ఈఆర్ఏ ఒఎస్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయాలి

ఏజెన్సీలో వివిధ ఇంజనీరింగ్ శాఖలద్వారా మంజూరైన పనుల నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఉపాధి హామీపథకం ద్వారా మంజూరైన పనులు త్వరితగతిన క్వాలిటీలతో పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పనుల పర్యవేక్షణకు మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించినట్లు తెలిపారు. వర్షాకాలంలో ఇసుకకు ఇబ్బంది లేకుండా ముందుగానే ఇసుకస్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జూన్ నెలాఖరు నాటికి బీఎస్ఎన్ఎల్ టవర్ల లైన్లు పూర్తి చేయాలన్నారు. ఏపీడీ జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, మల్లిఖార్జున, డీఈఈలు చైతన్య, పి.వెంకటరమణ, సాయిసతీష్, సుబ్బారావు, శివ, మల్లిఖార్జునరావు, ఉమా శంకర్, శ్రీనివాసరావు, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

ప్రతి అర్జీ పరిష్కరించేలా చర్యలు: ఎమ్మెల్యే శిరీషదేవి



అర్జీని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గృహాలు, పించన్లు, రోడ్లు, సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. రంపచోడవరం మండలం తామరపల్లిలో చేతి పంపు బోర్, దేవీపట్నం మండలం శరభవరంలో కమ్యూనిటీ భవనం, లైబ్రరీ, వీఆర్ పురంలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో పేర్లు నమోదు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. ప్రతి అర్జీని అధికారులకు పంపించి పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, వై.నిరంజనీదేవి పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ నిర్వహించాలి

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య



ఎటపాకలో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పుల్లయ్య

ఎటపాక, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి నివారణలో బాగంగా ప్రతీఇంట్లో ఐఆర్ఎస్ (స్ప్రేయింగ్(పిచికారీ)ను తప్పనిసరిగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య చెప్పారు. బుధవారం నెల్లిపాక పీహెచ్‌సీ పరిధిలోని బుట్టాయిగూడెం గ్రామంలో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్‌ను ప్రారంభించారు. ఏజెన్సీ గ్రామాల్లో మలేరియా వ్యాప్తి మైదాన ప్రాంతాల కంటే ప్రమాదకరంగా ఉందని తెలిపారు. మలేయావ్యాప్తి నివారణకు ఐఆర్ఎస్ పిచికారీ చేయించుకుని, సహకరించాలని కోరారు. ఇళ్లు, పశువుల పాకలు, మేకల పాకలు, కోళ్లపాకల్లో కూడా పిచికారీ చేయించుకోవాలన్నారు. డాక్టర్ విష్ణుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో దోమల మందు పిచికారీ చేయించాలి

రంపచోడవరం: ప్రతి ఇంట్లో మలేరియా నివారణ దోమలమందు పిచికారీ తప్పక చేయించుకోవాలని ముసురుమిల్లి సర్పంచ్ మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, ఎంపీటీసీ వంశీ కుంజం అన్నారు. బుధవారం గోపవరంలో దోమల మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ తెరలు ఇచ్చి సుమారు నాలుగు సంవత్సరాలు అయ్యిందని వర్షాకాలం వచ్చేనాటికి దోమతెరలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శారపు బాపిరాజు, పీసా కార్యదర్శి బందం రవి, ఏఎంవో రాజు, సీహెచ్‌వో అన్నపూర్ణ, ఎస్‌యూవో సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు సతీష్, మోహనరావు, ఏఎన్ఎం సుబ్బమణ్యం, బందం ఆనందరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోతట్టులో దోమల మందు పిచికారీ

అడ్డతీగల: అడ్డతీగల మండలం దుప్పులపాలెం పీహెచ్‌సీ పరిధిలోని దుర్వర్తి పంచాయతీ డి.పోలవరం గ్రామంలో పీహెచ్‌సీ అధికారిణి డాక్టర్ స్పందన ఆధ్వర్యంలో మొదటి విడతగా ఏసీఎం 5శాతం (ఆల్ఫాసైపర్ మిథెన్) దోమల మందును పిచికారీ చేశారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయండి

● చట్టి, వీరాపురం నిర్వాసితుల డిమాండ్



చింతూరు ఐటీడీఏకి ర్యాలీగా చేరుకున్న బాధితులు

చింతూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులైన తమకు న్యాయం చేయమని చట్టి, వీరాపురం గ్రామస్థులు కోరారు. బుధవారం వారంతా వారి గ్రామాల నుంచి ర్యాలీగా చింతూరు ఐటీడీఏ వద్దకు చేరుకొని తమకు న్యాయం చేయమని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ 2022లో తమ గ్రామం వరద నీట మునిగిందని, అదే దశలో ప్రతిఏటా ముంపు భయంతో పరుగులు పెట్టాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. వరద కారణంగా గ్రామంలోని ఇళ్ళన్నీ నిండామునిగినా తమ గ్రామాలను 41.5 కాంటూరు స్థాయి పరిగణనలోకి తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం తమ దుస్థితిని అర్థం చేసుకొని తమ గ్రామాలను 41.5 కాంటూరు స్థాయి ముంపులో చేర్చి తక్షణమే పునరావాసం, పరిహారం చెల్లింపు చర్యలు తీసుకోవాలని వారంతా కోరారు.

కొత్త పంచాయతీ కార్యదర్శులతో పరిచయ సమావేశం

వై.రామవరం, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా నియామకమైన పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఎంపీ డీవో బాపన్నదొరతో పరిచయ సమావేశం జరిగింది. నూతన కార్యదర్శులతో ఎంపీడీవో మాట్లాడుతూ విధులు, నిర్వర్తించాల్సిన కార్యాచరణ, ప్రణాళికలు గురించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో నూతన కార్యదర్శులు పి.లక్ష్మీనాగ సత్య, ఎం.మణికంఠ, టీఎం.కృష్ణ, ఎం.రమేష్, జి.ఉమ, కె.సంధ్యశ్రీవీణ, ఎస్.సతీష్, బి.భాను సంతోష్ పి.వెంకటరమణ, గోపీ సీతారామకృష్ణ, జి.సత్యవరప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరయ్యే తొమ్మిది యూనిట్లకు 21మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎస్‌బిఐ మేనేజర్ వీరకుమార్ పాల్గొన్నారు.



స్థలం ఆక్రమణపై వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

అంగన్‌వాడీ స్థలం ఆక్రమణపై అధికారుల విచారణ

తుని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తుని మండలం కేవో మల్లవరం గ్రామంలో అంగన్‌వాడీ స్థల ఆక్రమణపై జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుమేరకు స్థానిక రెవెన్యూ, అంగన్‌వాడీ అధికారులు విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంపై ఆరా తీశారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులు వెల్లడించారు. విచారణలో వీఆర్వో గోపాలకృష్ణ, సెక్రటరీ వీరబాబు, సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో సామర్లకోట జట్టుకు ప్రథమ బహుమతి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా జై భీమ్‌యూత్ ఆధ్వర్యంలో 2రోజులు పాటు నిర్వహించిన జిల్లాస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. 26 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ విజేతగా సామర్లకోట జట్టు, ద్వితీయ బహుమతిని ఏలేశ్వరం జట్టు, తృతీయ బహుమతి ధర్మవరం జట్టు విజేతలుగా నిలిచారు. ప్రథమ విజేతకు రూ.20వేలు, షీల్డ్‌ను ఎంఎంఆర్ ట్రస్టుచైర్మన్ ముదునూరి మురళీరాజు, ద్వితీయ విజేతలకు రూ.10వేలు, షీల్డ్‌ను ధర్మవరం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, తృతీయ విజేతకు దళిత నాయకుడు ఊబా కృపావరం రూ.5వేలు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమాల్లో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు, యాళ్ళ ఏసు, జువ్వల మునలయ్య, దడాల అప్పన్న, వెండిపల్లి చంద్రశేఖర్, తోటభాస్కర్, రాపా గుర్రాజు, ఇంటి వీర్రాజు పాల్గొన్నారు.



ఉప్పలపాడు దారి బ్రిడ్జిలో చేరిన వర్షంనీరు

బ్రిడ్జి కింద నీరు... తొలగించరూ!

గండేపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లేపల్లి నుంచి ఉప్పలపాడు వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి కింద నీరు చేరుకోవడంతో స్థానికులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సమయంలో ఇక్కడ నీరు చేరుకుంటుంది. ఆ దారిలో స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. అయితే ఇక్కడ నీరు చేరడంతో ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తునిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తుని రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు, దంతులూరి శ్రీనివాసరాజు, వాడపల్లి రాముతో పాటుగా 7వ వార్డు జనసేన కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ కొచ్చర్ల పాటి రూపాదేవి ప్రారంభించారు. రోగులకు డాక్టర్ నవతేజ, డాక్టర్ డీఎల్ మౌనిక, డాక్టర్ ప్రసాదులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అల్లు రాజు, దంతులూరి సూరిబాబు, ఉప్పలపాటి సీతారామరాజు, మొగ్గ తేజ ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



టాస్ వేస్తున్న జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్

కాట్రావులపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభం

జగ్గంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో కల్లేపల్లి రాజేష్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ముఖ్య అతిథులు కుడా చైర్మన్ తుమ్మలబాబు, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునాధరావు, జన్నల శంకర్, పసుపులేటి పవన్ ప్రారంభించారు. సీనియర్ క్రీడాకారులు, గ్రామానికి చెందిన ప్రముఖులను ముఖ్య అతిథులను సత్కరించి మెమెంటోలు అందజేశారు. తుమ్మలపల్లి రమేష్ టాస్‌వేసి పోటీలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 40 టీంలు పాల్గొన్నాయి. ప్రథమ జట్టుకు రూ.55,555, రెండో స్థానానికి రూ.33,333, మెమెంటోలు అందించనున్నారు. ప్రతిమ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు షీల్డ్‌తో పాటు నగదు బహుమతి ఇవ్వనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రతి జట్టుకు ప్రోత్సాహక బహుమతి రూ.2వేలు, క్రీడాకారులకు రోజూ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

'ఆదిత్య'లో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గండేపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం లోని ఆదిత్య విశ్వ విద్యాలయంలో 2025కి సంబంధించి ఆదిత్య క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. వందకిపైగా టీమ్స్ పాల్గొనగా మొదటి స్థానం ఆదిత్య యూనివర్శిటీ ఎంసీఏ ప్రథమ సంవత్సరం జట్టు కైవసం చేసుకుని ట్రోఫీతో పాటు రూ.25000 నగదు కైవసం చేసుకున్నారు. రెండో స్థానం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సీఎస్ఈ తృతీయ సంవత్సరం జట్టు ట్రోఫీతో పాటు రూ.15వేలు నగదు బహుమతి, మూడోస్థానం ఆదిత్యలో తృతీయ సంవత్సరం సివిల్ జట్టు ట్రోఫీతో పాటు రూ.10వేలు నగదు బహుమతి గెలుపొందారు. ముఖ్యఅతిథిగా యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



సిరిపురంలో తల్లిదండ్రులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగా భవానీ తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ప్రచారం చేశారు. బుధవారం 2025-26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు కోరుతూ గ్రామంలో ఇంటింటికీ ఉపాధ్యాయులు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో కలిగే ప్రయోగాలు తల్లిదండ్రులకు వివరించి కరపత్రాలు పంచారు. కార్పొరేట్ పాఠశాలలకు మించి ప్రభుత్వ బడుల్లో మెరుగై విద్యాబోధన, వసతులు ఉన్నాయన్నారు.

ఉచిత గ్యాస్ పథకాన్ని అందరికీ వర్తింప చేయాలి



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఉచిత గ్యాస్ పథకాన్ని అందరికీ వర్తింప చేయాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.చంద్రావతి కోరారు. ప్రత్తిపాడులో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ హెల్పర్స్ సమావేశానికి ప్రాజెక్టు కోశాధికారి హేమలత అధ్యక్షత వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా చంద్రావతి మాట్లాడుతూ పెరిగిన గ్యాస్ ధరలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, ప్రాజెక్టునాయకులు అల్లాడి లక్ష్మి, టి.హేమలత, నాగసత్యవతి, గని లక్ష్మి, చిన్నారిలోవ, నందిని, సీహెచ్ వెంకటలక్ష్మి ఉన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న హెచ్ఎం సుధామాధురి, సర్పంచ్ గంగరాజు

విద్య మీద దృష్టిసారిస్తే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చు

గండేపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్య మీద దృష్టి సారిస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, హెచ్ఎం సుధామాధురి అన్నారు. ఇటీవల ఇంటర్ ఫలితాల్లో అధిక ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కల్యాణి, సాయి పల్లవి, శివశ్రీకి బుధవారం మల్లేపల్లి హైస్కూల్ ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం, టీడీపీ గ్రామాధ్యక్షుడు తెలగారెడ్డి భద్రరావు, కొల్లు త్రిమూర్తులు, తెలగారెడ్డి ప్రకాశ్, మాజీ ఉపసర్పంచ్ దార్లంక శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎస్ఐ శివకుమార్

మోతుగూడెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం ఒడిశా సరిహద్దు ప్రాంతాలలోపోలీసులు నిఘా పెంచారు. మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద భద్రత పెంచారు. గంజాయి రవాణా అవుతుందని నిఘావర్గాల హెచ్చరికలతో ఒడిశా సరిహద్దులో పండించే గంజాయిని తెలంగాణాలోని హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు, ముఠాలు పర్యాటక ముసుగులో స్మగ్లర్లు రవాణా చేస్తున్నారన్న సమాచారంతో తెలంగాణావైపు వెళ్లే వాహనాలను మోతుగూడెం రాములగుడివద్ద ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలను పోలీసులు తనిఖీలు చేశారు. వాహనదారుల గుర్తింపు కార్డులను పరిశీలించి ఆరా తీశారు. గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో వాహనాలు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ పోలీసులు శ్రీను, సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

అడ్డతీగల: వాహనాల తనిఖీలో భాగంగా బుధవారం అడ్డతీగల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహరావు అడ్డతీగల మండలం వేటమామిడి సమీపంలో వాహనాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి తమ వాహనాలను తగు జాగ్రత్తలతో నడపాలన్నారు.

సచివాలయాల తనిఖీ

రాజవొమ్మంగి ఏప్రిల్ 16: మండలంలోని పలుసచివాలయాలను, ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. రాజవొమ్మంగి, దూసరపాము, అమీనాబాద్ సచివాలయలను తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం అమీనాబాద్ ఆశ్రమ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీచేసి, గొడౌన్‌లో ఉన్న కూరగాయలు, బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతోమాట్లాడారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ

అడ్డతీగల, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపడుతున్న ఉపాధి పనులను సోమవారం ఏపీడీ ఎల్.రాంబాబు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ పథకంలో మండలంలోని చేను పాకలు, బొడ్లంక, లోతవారివీధి గ్రామాలో నిర్మిస్తున్న పశువుల నీటితొట్టెల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామాలలో పనులను చేపట్టాలని ఆదేశించారు.



శంఖవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దోషులను కఠినంగా శిక్షించాలి

ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టిబాబు

శంఖవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు రాజాల చిట్టిబాబు డిమాండ్ చేశారు. బుధవారం శంఖవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మనమంతా ఓర్పుగా ఉండి పోలీసులకు సహకరించి దోషులను కఠినంగా శిక్షించేలా చేయాలన్నారు. కార్యక్రమంలో దండోరా జిల్లా కార్యదర్శి పలివెల సతీష్, బోట్ల లోవరాజు, దళిత సంఘాల నేతలు తదితరులు ఉన్నారు.

కాళ్ల దొంగబాబు విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

కిర్లంపూడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న స్థలంలో టీడీపీ నాయకుడు కాళ్ల దొంగబాబు విగ్రహం ఏర్పాటు చేసేందుకు బుధవారం టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చిన్నబాబు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

గండేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి 1 సచివాలయంలో బుధవారం పోషణా మహోత్సవాల సందర్భంగా తల్లులకు సీడీపీవో ఎం.పూర్ణిమ అధ్యక్షతన పోషకాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. నలుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.నాగపార్వతి, విజయకుమారి, మంగారత్నం, జ్యోతి, రాజేశ్వరి పాల్గొన్నారు.



ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

సారా రహిత సమాజమే లక్ష్యం

ఏలేశ్వరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సారా రహిత సమాజమే లక్ష్యంగా మండలంలోని ప్రజాప్రతినిధులు పని చేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులు నేతృత్వంలో నవోదయం2 సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్, సారా మత్తులో పడి విలువైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. గ్రామాల్లో సారా నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ సహకరించి ఎటువంటి మత్తు పానీయాలు విక్రయించినా ఉన్నాతాఅధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీడీవో సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారాల్లో నంది అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఫార్మాసిస్ట్‌కు నంది అవార్డు

కిర్లంపూడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌గా సేవలందిస్తున్న గురుస్వామి బొల్లు వెంకట కృష్ణగంగాధర్ ఉగాది నంది అవార్డు అందుకున్నారు. ఆయన్ను శబరిమల ఆలయ ప్రధాన అర్చకులు మెయిల్ శాంతైన మురళి నంబూద్రి, అలాగే గురుస్వామి దండపాణి కుమారుడు వేలు గురుస్వామి, ధర్మవరం గ్రామ పెద్దలు, కిర్లంపూడి పీహెచ్‌సీ వైద్యులు బి.రాంబాబు నాయక్ శుభాకాంక్షలు తెలిపారు.